


VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 51 | మంగళవారం 21 జూలై, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## పామాయిల్ ధర పెంపునకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది



పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయం పై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు.

## గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం.. రైతులకు మంత్రి తుమ్మల పిలుపు..



జులై 20 వార్త సాక్ష్యం

కొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు.

## స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసు పై ప్రధాని మోదీ చురకలు

- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని



## వారి రాక కోసం ఎదురుచూస్తున్నాం: ఇరాన్ విదేశాంగ ప్రతినిధి

జులై 20 వార్త సాక్ష్యం

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇరాన్ పై దాడుల్ని మరింత తీవ్రం చేస్తామని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ఇరాన్ చమురు నిల్వలకు కీలక ప్రాంతమైన ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేసే ఏ సాహసానికైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.



## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

- రాష్ట్ర వ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా



## కాక్రోజ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే అరెస్ట్..

జులై 20 వార్త సాక్ష్యం

కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధ్యక్షుడు అభిజిత్ దీప్కేను అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని ప్రజలకు వారు స్పష్టం చేశారు. అభిజిత్ దీప్కే .. జంతర్ మంతర్ ధర్నా పాయింట్ వద్ద ఉన్నారని ఢిల్లీ పోలీసులు వివరించారు. అభిజిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం కానీ.. అరెస్ట్ చేయడం కానీ జరగలేదని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది.



## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం



- మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం
- 'మన ఇల్లు - మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం.. రైతులకు మంత్రి తుమ్మల పిలుపు..

ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## వారి రాక కోసం ఎదురుచూస్తున్నాం: ఇరాన్ విదేశాంగ ప్రతినిధి

ఇరాన్ చమురు నిల్వలకు కీలక ప్రాంతమైన ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేసే ఏ సాహసానికైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఆ దేశ సైన్యం ఎలాంటి భూతల దండయాత్ర చేసినా.. స్వాగతం పలికేందుకు తాము నిమిషాలు లెక్కిస్తున్నామని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయి హెచ్చరించారు. 'ఇరాన్‌పై దాడి చేస్తే అమెరికా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాలి. ఆ ప్రాంతవాసులు వారి రాక కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు' అని ఆయన అన్నారు. ఇరాన్ తీరానికి 55 కి.మీ. దూరంలో బుషెహర్ ప్రావిన్స్‌లో ఉన్న ఖార్గ్ ఇరాన్ చమురు పరిశ్రమకు అత్యంత ప్రధానమైంది. ఆ దేశ చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ ద్వీపమే నిర్వహిస్తోంది. కాగా అమెరికాతో కుదిరిన మధ్యంతర ఒప్పందం పై ఇరాన్ వైఖరిని బఘేయి పునరుద్ఘాటించారు. దాని పై పూర్తి స్పష్టత ఉందని, అందులోని 14 నిబంధనల పై ఎలాంటి సందేహమూ అక్కర్లేదని ఆయన చెప్పుకొచ్చారు. 'హోర్ముజ్ జలసంధి భవిష్యత్తు నిర్వహణ బాధ్యత ఇరాన్‌పైనే ఉంటుందని మేం మొదట్నుంచీ చెబుతూనే ఉన్నాం. అదే విషయాన్ని ఒమన్‌తో సంప్రదింపులు, ప్రాంతీయ దేశాలతో చర్చల ద్వారా ముందుకు తీసుకువెళ్తాం. దౌత్యపరమైన కట్టుబాట్ల నుంచి వాషింగ్టన్ వైదొలగకూడదు. ఈ ఒప్పందం పూర్తి స్పష్టంగా ఉంది. దీనిని ఉల్లంఘించేందుకు అమెరికాకు ఎలాంటి సాకులూ లేవు' అని బఘేయి చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నంతో పాటు సైనిక చర్యలను ముమ్మరం చేయడం గురించి పదేపదే ప్రస్తావించారు. ఒకవేళ ఖార్గ్‌ను యూఎస్ స్వాధీనం చేసుకుంటే.. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఆ ప్రదేశంపై అమెరికా సైన్యం నియంత్రణ సాధించి, ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చినట్టువుతుంది. అయితే.. ఖార్గ్‌ను స్వాధీనం చేసుకోవడం, ఆక్రమించుకోవడం వల్ల అమెరికాకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

## కాక్రోజ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే అరెస్ట్

ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. ఈ యాత్రను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ భారీగా ఏర్పాట్లు చేశారు. అయినా నిరసనకారులు భారీ సంఖ్యలో పార్లమెంట్ వైపునకు దూసుకెళ్లారు. వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. దీంతో నిరసనకార్లు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**గీతాంజలి పై దాడి..**

ఇంకోవైపు ఈ యాత్రలో పాల్గొన్న సోనమ్ వాంగ్ చుక్ భార్య గీతాంజలి జుట్టు పట్టుకుని ఢిల్లీ పోలీసులు లాగారు. దీంతో గీతాంజలిపై పోలీసులు దాడి చేశారంటూ సీజేపీ ఆరోపించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న 12 ఏళ్ల బాలిక పై పోలీసులు దాడి చేశారని.. దీంతో ఆమె తల పగిలిందని వివరించింది. మరో 40 నుంచి 50 మంది సీజేపీ కార్యకర్తల తలలు పగిలిపోయాయని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది.

**నేటి నుంచి వర్షా కాల సమావేశాలు..**

సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పార్లమెంట్, జంతర్ మంతర్‌తోపాటు ఢిల్లీలోని వివిధ ముఖ్య ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. జూన్ 28వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం బలవంతంగా సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన చలో పార్లమెంట్ యాత్రకు ఆయన మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే.

# పామాయిల్ ధర పెంపునకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది

అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు.

**పామాయిల్ ధర పెరిగింది..**

1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసు పై ప్రధాని మోదీ చురకలు

లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సమావేశాలకు ముందు పార్లమెంట్ భవనం వెలుపల ప్రసంగించిన మోదీ.. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 విజయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయానికి కారణమైన యువ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. అదే సమయంలో ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 విజయవంతంగా కక్ష్యలోకి చేరడం దేశానికి గర్వకారణమని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టుపై పని చేసిన బృందం సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదంటూ రాహుల్ గాంధీపై పరోక్షంగా సెటైర్ వేశారు. ఇటీవల 56 ఏళ్లు పూర్తి చేసుకున్న రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడిగా ప్రచారం చేస్తుండటాన్ని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీది '56 అంగుళాల ఛాతీ' అంటూ పలువురు బీజేపీ నేతలు చెప్పారు. ఈ వ్యాఖ్యను కాంగ్రెస్ నేతలు అనేక సందర్భాల్లో విమర్శలకు ఉపయోగించారు. ఈ ఏడాది పార్లమెంట్‌లో చైనా అంశంపై మాట్లాడిన రాహుల్ గాంధీ.. '56 అంగుళాల ఛాతీ ఏమైంది?' అంటూ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఆ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే ఇప్పుడు మోదీ '56 ఏళ్ల యువకుడు' అంటూ కౌంటర్ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎంపీ రాహుల్ గాంధీ పై విమర్శలు చేస్తూనే స్కైరూట్ యువ బృందం సాధించిన విజయం దేశ యువతలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిందని మోదీ అన్నారు. అంతరిక్ష రంగంలో దేశ యువత సామర్థ్యానికి ఇది నిదర్శనమని కొనియాడారు. ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ రోజురోజుకూ పెరుగుతోందని, దేశ యువత ఆశయాలకు ఆకాశమే హద్దు కాదనే సందేశాన్ని ఈ విజయం ఇచ్చిందన్నారు. మరోవైపు, వర్షాకాల సమావేశాలు దేశ ప్రయోజనాల దిశగా సాఫీగా సాగాలని మోదీ ఆకాంక్షించారు. పార్లమెంట్‌లో వాస్తవాలు, తర్కంతో కూడిన చర్చలు జరగాలని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రతి సభ్యుడి స్వరం వినిపించేలా సభ నడవాలని, అనవసర గందరగోళానికి తావు లేకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరగాలని ప్రధాని మోదీ సూచించారు.

# తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాల పై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జఠిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా.

**వివిధ కేటగిరీల కింద పట్టాల పంపిణీ:**

మంగళగిరి, నవులూరు గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్ల భూములు కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నిషేధాన్ని తొలగిస్తూ, ఆర్డీవో ధ్రువీకరించిన 'ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల'ను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు. స్టీల్ బ్రిడ్జ్ నిర్వాసితులకు పట్టాలు: అమరావతిలో బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో నిర్వాసితులైన 81 మందికి పునరావాసం కింద ఆత్మకూరు లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. వీరికి సంబంధించిన పట్టాలను కూడా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు. 150 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 906 పట్టాలను సిద్ధం చేశారు. వీటిలో తాడేపల్లి మండలానికి 630, మంగళగిరి మండలానికి 276 పట్టాలు ఉన్నాయి. మొత్తంమీద, దశాబ్దాలుగా కాగితాలపై హక్కుల్లేక అభద్రతాభావంతో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు మంత్రి లోకేశ్ చొరవతో శాశ్వత భరోసా లభించనుంది.

# వినాయక చవితి సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ సమితి కీలక పిలుపు

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో తెలంగాణవ్యాప్తంగా ఉన్న అన్ని గణేశ్ మండపాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, 'వందేమాతరం' గీతాన్ని ఆలపించాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పిలుపునిచ్చింది. బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, సెప్టెంబర్ 17న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించింది. మూసాపేట్‌లోని పుల్లారెడ్డి పాఠశాలలో సోమవారం ఉత్సవ సమితి అధ్యక్షుడు జి. రాఘవ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. రాష్ట్రంలోని 32 కేంద్రాల నుంచి 64 మంది ప్రతినిధులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ మాట్లాడుతూ, యువతలో దేశభక్తిని పెంపొందించడం, సాంస్కృతిక విలువలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. యువతరానికి సనాతన ధర్మంపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ కోరింది. కుల వివక్షను రూపుమాపి, హిందూ ఐక్యతను బలోపేతం చేసేందుకు సంత్ రవిదాస్ 650వ జయంతిని, అలాగే సామాజిక చైతన్యం కోసం విశ్వహిందూ పరిషత్ నేత అశోక్ సింఘాల్ జయంతిని వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని, పండుగ పై జరిగే దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు. మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా, స్థానిక సంస్థల ద్వారా నిధులు కేటాయింపుతో పాటు పోలీసుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువత డీజే సంస్కృతికి దూరంగా ఉంటూ, దేశభక్తిని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే భజన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ ఏడాది సెప్టెంబర్ 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానుండగా, 25న నిమజ్జన మహోత్సవం జరగనుంది. హైదరాబాద్‌లో సుప్రసిద్ధమైన ఖైరతాబాద్ గణేశ్ ఈసారి 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహా గణపతి'గా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 21 జూలై, 2026

# మాల జాతి ముద్దు బిడ్డకు.. జిల్లా కలెక్టర్, రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా అరుదైన గౌరవం

-పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి ప్రతిభ
-కొత్తపల్లి మండలం వీరాపురం గ్రామానికి చెందిన గణముల మల్లయ్య కుమారుడికి ప్రతిభ పురస్కారం
-నా చదువుకు బహుమతి అందించిన జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర మంత్రివర్యులకు ప్రత్యేక అభినందనలు
-ఆత్మకూరు, నందికొట్కూరు మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో హర్షం

ఆత్మకూరు జులై 20 వార్త సాక్ష్యం



నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఫరూక్ చేతుల మీదుగా సోమవారం నంద్యాల జిల్లాలో పదవ తరగతి ఫలితాలలో స్టేట్ ర్యాంక్ సాధించిన షైనింగ్ స్టార్ అవార్డుల సందర్భంగ నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లె మండల పరిధిలోని వీరాపురం గ్రామానికి చెందిన గనమల మల్లయ్య సరస్వతి విద్యా మందిర్ కరస్పాండెంట్ పెద్ద కుమారుడు పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించడంతో ప్రతిభా అవార్డు రాష్ట్ర మంత్రి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవడంతో మాల జాతి ముద్దుబిడ్డ గణమల రాఫెల్ షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్న శుభ సందర్భంలో కొత్తపల్లి మండలం మాల మహానాడు, నందికొ ట్కూరు ఆత్మకూరు మాల మహానాడు తాలూకా కమిటీ తరఫున ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు ఉన్నత చదువులు చదివి మునుముందు ఇలాంటి అవార్డ్స్ ఎన్నో అందుకోవాలని మన జిల్లాకే కాదు స్టేట్ కు కూడా మంచి పేరు తేవాలని ఆశిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు ప్రతిభను కనపరిచి అవార్డులు అందించిన రాష్ట్రమంత్రికి జిల్లా కలెక్టర్ కు ఆత్మకూరు, నందికొట్కూరు, కొత్తపల్లి మండల మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

# ప్రజల ఆస్తుల భద్రతకు ముప్పు కలిగించే జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలి

-సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ -- స్టాంప్ రైటర్ల సంఘం డిమాండ్

నందికొట్కూరు జులై 20 వార్త సాక్ష్యం



ప్రజలు, రైతుల ఆస్తుల భద్రతకు భంగం కలిగించే అవకాశం ఉన్న జీవో నెం. 396ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, స్టాంప్ రైటర్ల సంఘం నాయకులు ఇక్బాల్, స్వామన్న ప్రభుత్వాన్ని సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కొన్ని సేవలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధంగా ప్రభుత్వం జీవో నెం. 396ను తీసుకువచ్చిందని, దీనివల్ల ప్రజలు, రైతుల ఆస్తుల వ్యవహారాల్లో ప్రభుత్వ ప్రత్యక్ష బాధ్యత తగ్గి, భవిష్యత్తులో ఆస్తుల భద్రతపై అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రారంభమైన నాటి నుంచి స్టాంప్ రైటర్లు ప్రజలకు, రైతులకు వారధిగా నిలిచి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలందిస్తున్నారని తెలిపారు. అలాంటి పారదర్శకమైన వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదన్నారు. ఉద్యోగ అవకాశాలు లేక డిగ్రీ, పీజీ విద్య పూర్తి చేసిన అనేక మంది యువకులు జీవనోపాధిగా స్టాంప్ రైటర్ వృత్తిని ఎంచుకున్నారని, వీరి వల్ల ప్రభుత్వంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టడం బాధాకరమని అన్నారు. జీవో నెం. 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 12 రోజులపాటు పెన్‌డౌన్ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టాంప్ రైటర్లు, సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నందికొట్కూరు ప్రాంతీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కె. స్వామన్న, టి. నరసింహులు, ఎం. చంద్రశేఖర్, త్యాగరాజు, వడ్డే సుధాకర్, శ్రీరాములు, మహిళా జిల్లా నాయకురాలు ఎస్. బీబీ, మణికుమారి తదితరులు పాల్గొన్నారు

# నందికొట్కూరు డివిజన్‌లో రాష్ట్రస్థాయి సహాయ నిరాకరణ ఉద్యమ రిలే నిరాహార దీక్షలు

-నందికొట్కూరు అగ్రికల్చర్ కార్యాలయం ముందు కార్యక్రమం ప్రారంభం
-సిపిఐఎంఎల్ ఎవరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘీభావం

నందికొట్కూరు జులై 20 వార్త సాక్ష్యం



నందికొట్కూరు పట్టణంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సహాయ నిరాకరణ ఉద్యమ ర్యాలీ తోపాటు వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షకు మద్దతుగా సంఘీభావం తెలిపేందుకు సిపిఐఎంఎల్ ఎవరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నందికొట్కూరు డివిజన్‌తో పాటు ఆత్మకూరు డివిజన్‌కు చెందిన ఎంపీఎఓలు (ఎంపీస్ ) పెద్ద ఎత్తున తమ హక్కుల సాధన కోసం ఉద్యమం ఆగదని డిమాండ్ చేశారు ఎంపీఎఓలు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. "సమాన పనికి సమాన వేతనం" కల్పించాలని, ప్రస్తుతం ఉన్న నాన్-సాంక్షన్ పోస్టులను సాంక్షన్ పోస్టులుగా మార్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న అన్ని సంక్షేమ సదుపాయాలు, భత్యాలు తమకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, 2014 నుంచి 2026 వరకు కేవలం రూ. 12,000 వేతనంతోనే విధులు నిర్వర్తించడం వల్ల తమ జీవనం ఎంతో దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి, తమ నెలవారీ వేతనాన్ని రూ. 35,000లకు పెంచాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీఎఓలు, ఎస్ సలాం భాష సుధాకరు. గడ్డం విష్ణు అఖిల్ ఇమ్రాన్ అమృత వేణుబాయి. మున్సీర్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రజాసంఘాల నాయకులు. నందికొట్కూరు మండల కార్యదర్శి కాటేపూకు సోమన్న మిడుతూరు మండల కార్యదర్శి మేకల చంద్రశేఖర్ బంగ్లా మండల కార్యదర్శి పి నరసింహులు పగిడాల మండల నాయకులు త్యాగరాజు రైతు సంఘం జిల్లా నాయకులు వడ్డే సుధాకర్ వడ్డే శ్రీరాములు. తదితరులు పాల్గొన్నారు

# మహిళల ఆరోగ్య భద్రతే సఖి హబ్ లక్ష్యం





-లైఫ్స్ అధ్యక్షులు కలిముల
-మహిళల ఆరోగ్య జాగ్రత్తల కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటాం విజయభారతి, సునీత,

ఆత్మకూరు జులై 20 వార్త సాక్ష్యం

లిటిల్ ఫ్లవర్ ఎడ్యుకేషన్ సొసైటీ (లైఫ్స్) వారి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని , నంద్యాల జిల్లా సఖి హబ్ సమావేశం నిర్వహించారు సమావేశంలో లైఫ్స్ అధ్యక్షులు కలీముల్లా , మార్కాపురం నంద్యాల జిల్లా కోఆర్డినేటర్లు వరం సునీత, విజయ భారతిలు హాజరయ్యారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో. విజయ భారతి మాట్లాడుతూ, "స్త్రీ లేనిదే సృష్టి లేదు" అని పేర్కొంటూ, సృష్టికి మూలమైన మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం సామాజిక సేవా దృక్పథంతో సఖి హబ్ ఉచిత ఆరోగ్య సలహా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. మహిళల ఆరోగ్య భద్రత అత్యంత ముఖ్యమని, ఇంటి ఇల్లాలు ఆరోగ్యం గా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా సమాజం కూడా ఆరోగ్యవ ంతంగా మారుతుందని తెలిపారు.సఖి హబ్ కోఆర్డినేటర్లు మహిళలను బృందాలుగా ఏర్పాటు చేసి ఉచిత ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేలా మహిళలకు మార్గనిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. మహిళల ఆరోగ్యం, భద్రత, మహిళలు ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చిం చారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల బ్లాక్ కోఆర్డినేటర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రజా పోరాటాలు చేయాలి

-సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్. ఎం. డి. .రఫీ

వెలుగోడు జులై 20 వార్త సాక్ష్యం





ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.ఎండి .రఫీ పిలుపునిచ్చారు. సోమవారం వెలుగోడు పట్టణ కేంద్రంలో అఖిలభారత రైతుకుల సంఘం ముఖ్య కార్యకర్త సమావేశం అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు బి . ఆనంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ) న్యూ డెమోక్రసీ రఫీ, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు పి. లాజరస్ , అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు బి ఆనంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. అయితే ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టినా కీలక హామీలు అమలు కాలేదని విమర్శించారు. 18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు నెలకు ?1,500 ఆర్థిక సహాయం, 50 సంవత్సరాలు నిండిన మహిళలకు పింఛన్, ఇంటి స్థలం లేని పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగి ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలతో కలిసి విస్తృత స్థాయిలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నూతన అఖిల భారత రైతు కూలీ సంఘం వెలుగోడు మండల కమిటీ ఎన్నిక నూతన అధ్యక్షులుగా షేక్ చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శిగా ముబారక్, ఉపాధ్యక్షులుగా రవి, సహాయ కార్యదర్శిగా నాగార్జున కోశాధికారిగా పెద్దక్క మరియు కమిటీ సభ్యులుగా ఏడు మంది ఎన్నుకోవడం జరిగింది ఈ కమిటీ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసేందుకు ఉద్యమం బాటగా సిద్ధంగా ఉంటారని రైతు కూలి సంఘం అధ్యక్షులు బి.ఆనంద్ తెలిపారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

-ఎస్ ఎఫ్ ఐ, సీఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ఆత్మకూరు జులై 20 వార్త సాక్ష్యం






ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ దీక్ష కు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు కే దినేష్ కుమార్ సిఐటియు ఆత్మకూర్ పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ ఎస్ఎఫ్ఐ కే సాయికుమార్ లు అన్నారు సోమవారం పట్టణంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు, గౌడ సెంటర్, అంబేద్కర్ విగ్రహం ముందు ర్యాలీ నిర్వహిస్తూ నీట్ పేపర్ లీకేజీ కి భాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐటియు డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గత 21 రోజులుగా డిల్లీ లో సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష కు కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయంలో వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఒక్క నీట్ పేపర్ వరసగా లీకేజీ అవుతుందని అన్నారు. ఎన్ టి ఏ అసమర్థత స్పష్టంగా కనపడుతున్నది ఇది బీజేపీ జేబు సంస్థలాగా పని చేస్తుందని అన్నారు. ఎన్నో వేల, లక్షల మంది విద్యార్థులు మరియు తల్లిదండ్రుల కలను నిరాశ కలిగించేలా చేశారన్నారు అన్నారు. పేపర్ లీకేజీ వల్ల అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ఇవన్ని కేంద్ర ప్రభుత్వ హత్యలే అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన రాజీనామా చేయాలని నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గత 21 రోజులుగా పర్యావరణవేత్త సామాజిక కార్యకర్త సోనం వాంగ్చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రభుత్వం ఎటువంటి స్పందన లేకపోవడం దారుణం అన్నారు. సోనం వాంగ్ చుక్ కి ఏమి జరిగినా అది కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుంది అన్నారు. ఇప్పటికే సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ప్రమాదకర స్థితిలో ఉన్నదని ప్రభుత్వం స్పందించి ఆయనతో చర్చలు జరపాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని దీనికి ప్రభుత్వం స్పందించి ఆయన దీక్షను విరివింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా మరియు రాష్ట్ర,దేశవ్యాప్తంగా వేల మంది విద్యార్థులతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ఇంటి ముట్టడైన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు అక్మల్, వెంకటేష్, బన్నీ, కైఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 21 జూలై, 2026

## ఉప్పలదడియ గ్రామానికి శ్మశాన స్థలాన్ని అధికారులు చూపించండి

**-ఆత్మకూరు ఆర్డిఓ కు వినతి పత్రం ద్వారా ఫిర్యాదు**
**-ఏ.పీ.శ్మశాన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలారి నాగరాజు**



ఆత్మకూరు జులై 20 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లా మిడ్తూరు మండలంలోని ఉప్పలదడియ గ్రామానికి శ్మశాన స్థలాన్ని కేటాయించాలని గ్రామ ప్రజలు ఏపీ స్మశాన రాష్ట్ర కమిటీ నాయకుడి తలారి నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఆత్మకూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట శివకు ఆ గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు ముందుగా ఆర్డీవోకు శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ స్మశాన కార్మిక సంఘం నాయకుడు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్మశాన వాటిక స్థలం లేక ప్రతిసారి ఎన్నో ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు వెంటనే ఈ విషయాన్ని ఆత్మకూరు ఆర్డీవో దృష్టికి తీసుకురాగా, త్వరలో శ్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయటకు కృషి చేస్తున్నామని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట శివ ఆ గ్రామ ప్రజలకు భరోసా కల్పించారు స్పందించిన ఆర్డీవోకు గ్రామ ప్రజలు మరియు రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఈ జమ్మన్న ట్రెజరర్ రత్న స్వామి, కమిటీ సభ్యులు ఎం . నాగన్న ,వై . రమేష్ బాబు,వై . కుమార్,వై నాగన్న,వై . ఫ్రాన్సిస్ వై . యేసన్న తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం

**-ఎన్ హెచ్ ఆర్ సి వాలంటరీ ఆర్గనైజేషన్( స్వచ్ఛంద సంస్థ )**
**నంద్యాల జిల్లా చైర్మన్ షేక్ జిలాని**

ఆత్మకూరు జులై 20 వార్త సాక్ష్యం



సమాజంలో ప్రతి ఒక్కరి మానవ హక్కులను కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తానని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ( ఎన్ హెచ్ ఆర్ సి ) వాలంటరీ ఆర్గనైజేషన్( స్వచ్ఛంద సంస్థ) నంద్యాల జిల్లా నూతన చైర్మన్‌గా ఎన్నికైన షేక్ జిలాని స్పష్టం చేశారు. సోమవారం తన నియామకం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, కౌన్సిల్ అధిష్టానానికి మరియు తనకు సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ జిలాని మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పలు కీలక అంశాలను పంచుకున్నారు. బాధితులకు అండగా ఉంటూ సమాజంలో అణగారిన వర్గాల హక్కులకు భంగం వాటిల్లినప్పుడు, బాధితులకు కౌన్సిల్ తరపున పూర్తి న్యాయం జరిగేలా పోరాడుతామని హామీ ఇచ్చారు. అవగాహన సదస్సులు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులకు మానవ హక్కులపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే అన్యాయాలను అడ్డుకోగలమని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారుల సహకారంతో.. జిల్లాలోని పోలీస్, రెవెన్యూ మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో మానవ హక్కుల ఉల్లంఘనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచుతామని చెప్పారు.

## గణేష్ నగర్‌లో వీధిదీపాలు వేయాలి

**-బీజేపీ కల్లూరు అర్బన్-2 మండల అధ్యక్షుడు ఉలిందకొండ రవి**
**-మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి నాయకుల వినతి**

కర్నూలు,ప్రతినిధి, జులై 20 వార్త సాక్ష్యం



కర్నూలు నగరపాలక సంస్థ (కె.ఎం.సి)19వ వార్డు పరిధిలోని గణేష్ నగర్,శుద్ధ వాగు లైను రోడ్డు ప్రాంతాల్లో వెలగని వీధిదీపాలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కల్లూరు అర్బన్-2 మండలాధ్యక్షుడు ఉలిందకొండ రవి,జిల్లా అధికార ప్రతినిధి కొట్ట చెన్నయ్య మాట్లాడుతూ వార్డు పరిధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం,శివాలయం, ఆంజనేయ స్వామి గుడి పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా వీధిదీపాలు వెలగకపోవడంతో రోడ్లన్నీ చీకటిమయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో దారి తెలియక స్థానిక ప్రజలు,ముఖ్యంగా మహిళలు,వృద్ధులు,చిన్న పిల్లలు తీవ్ర భయాందోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నారని,ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి,విద్యుత్ విభాగం సిబ్బందిని ఆదేశించి యుద్ధప్రాతిపదికన కొత్త వీధిదీపాలను ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దర్గా స్వామి,సీనియర్ నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని: ఐసా





**-ఎన్ టి ఏ ను రద్దు చేయాలనిఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష**
**-సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను పోలీసులు భగ్నం చేయడంతో కర్నూలు దద్దరిల్లిన ధర్నా**
**-విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా విజయవంతం**

కర్నూలు జులై 20 వార్త సాక్ష్యం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఐస ఆల్ ఇండియా అధ్యక్షురాలు కామ్రేడ్ నేహా, కామ్రేడ్ మనీష్, కామ్రేడ్ అమీన్ కొనసాగిస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా 'పార్లమెంట్ మార్చ్' పిలుపులో సోమవారం కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఐసా కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో ధర్నా ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున ఐసా ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్ సాయి పవన్ ఐసా పట్టణ నాయకులు లోకేష్,కిరణ్, సాయి,నాయక్, హాజరయ్యారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఐసా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ ఢిల్లీ రాజధాని లో ఎన్ టి ఏ ను రద్దు చేయాలని కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేయడం సరైనది కాదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు విద్యార్థుల హక్కుల సాధనకై ఉద్యమించే విధంగా దీక్షలు చేపడితే పాలకులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తూ విద్యా వ్యవస్థ హక్కులను కాలరాస్తున్న పాలకులకు సరైన గుణపాఠం చెబుతామని ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామి దాసు నాగార్జున డిమాండ్ చేశారు ఈ ధర్నా కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## నంద్యాలలో వర్షాల కోసం ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు





**-దువా నిర్వహించిన మౌలానా ముఫ్తి అజ్మతుల్లా**
**-ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్**

నంద్యాల జులై 20 వార్త సాక్ష్యం

సోమవారం నంద్యాల పట్టణ భీమవరం రహదారిలో ఉన్న అల్- ఫుర్కాన్ ఈద్గా నందు వర్షాల కోసం ఇస్తిస్కా నమాజ్, ప్రత్యేక దువాను జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు అబ్దుల్ హాది సయీది అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ప్రార్థనలో మౌలానా ముఫ్తి అజ్మతుల్లా పాల్గొని వర్షం కోసం దువా నిర్వహించారు. రైతులకు ఈ వర్షాలు ఎంతో మేలు చేస్తాయని, గత కొన్ని రోజులుగా వర్షాలు లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, ఆ అల్లా దయవల్ల వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు బాగా పండాలని ప్రత్యేక ప్రార్థనల్లో అల్లాను వేడుకున్నారు. నంద్యాల జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురవాలని ఆ అల్లా దయ వల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్, ముస్లిం జెఏసీ నాయకులు అబులైస్, సమద్, మదరసా నిర్వాహకులు, మదరసా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, గత సంవత్సరం ఈ సమయానికి దాదాపుగా అన్ని ప్రాజెక్టులు, డ్యాములు, నదులు నిండాయని, కానీ ఇప్పుడు వర్షాభావం వల్ల కరువు పరిస్థితుల వల్ల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇటువంటి వర్షాభావ పరిస్థితులలో ఇస్తిస్కా నమాజ్, ప్రత్యేక దువా చేయడం వల్ల ఆ అల్లా కరుణ కటాక్షాల వల్ల వర్షాలు పడే అవకాశం ఉందని, ఈ ప్రత్యేక ప్రార్థనలో పెద్ద సంఖ్యలో పట్టణ ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఇద్రిస్, మౌలానా హుసేన్ రషాది, హాఫిజ్ షరీఫ్ సాహెబ్, మౌలానాలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రి ఎన్ఎండి ఫరూక్






**-కలెక్టర్, ఎమ్మెల్సీ సమక్షంలో నందిగ్రామ సమంత కు 3 గ్రాముల బంగారు కమ్మలను అందజేసిన మంత్రి ఫరూక్**

నంద్యాల, జూలై 20 వార్త సాక్ష్యం

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంచేందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. 2026 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 585 మార్కులకు పైగా సాధించే ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, కస్తూర్బా పాఠశాలల నంద్యాల బాలికలలో ఒకరికి 3 గ్రాముల బంగారం బహూకరిస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీ మేరకు, సోమవారం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదివి, పదవ తరగతి ఫలితాలలో 589 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నందిగ్రామ సమంత అనే విద్యార్థినికి మంత్రి ఫరూక్ హామీ ఇచ్చిన బంగారాన్ని అందజేశారు. పట్టణంలోని చాబోలు రోడ్డులో ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, సమక్షంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ విద్యార్థిని సమంత కు 3 గ్రాముల బంగారు కమ్మలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినులు చదువులో రాణించాలనే ఉద్దేశంతోనే ఈ బహుమతిని ప్రకటించామని, సమంత లాంటి విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జనార్ధన్ రెడ్డి, ఉర్దూ డిఐ అస్ముద్దీన్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

నంద్యాల జులై 20 వార్త సాక్ష్యం

నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసుల మేరకు మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అందజేశారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖరరెడ్డి స్వగృహంలో పాములపాడు మండలం వెంపెంట గ్రామం బి. పాంఛీష్ కు రూ. 1,84,973 లు, నందికొట్కూరు కు చెందిన షేక్. అబ్దుల్ రసీద్ కు రూ. 2,09,243 లు, బండి ఆత్మకూరు మండలం జి. లింగాపురం కు చెందిన అంబటి. సుంకిరెడ్డికి రూ. 88500 లు ఇలా ముగ్గురికి మొత్తం 4,82,716 లక్షల చెక్కులు బాధితులకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పంపిణీ చేశారు.



# ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

**జులై 20 వార్త సాక్ష్యం:**

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడా లని కలెక్టర్ ఆదేశించారు.కాగా ప్రజావాణి మొత్తం 175 దరఖాస్తులు వచ్చాయి.వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**-డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల,వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల్లోనూ ప్రజావాణి కొనసాగుతుందని,స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కి 6, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో 4 ప్రజావాణికి



దరఖాస్తులు వచ్చాయి.ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ,జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత ఢ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**

**-ప్రజావాణి పిర్యాదుల సంఖ్య : 91**

**జులై 20 వార్త సాక్ష్యం :**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత అదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 91 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులు త్వరగా





పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ చర్యలు తీసుకోబడునని చేయబడునని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**-నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రిసర్వే, ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన**

**జులై 20 వార్త సాక్ష్యం**

మల్లాపూర్ మండలం నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించి



ందని తెలిపారు. ప్రస్తుతం 7 గ్రామాల్లో ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. నడికుడగ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రైతులు, గ్రామస్థుల అడిగిన సందేహాలకు తగిన సలహాలు, సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ రాంచందర్ , సర్వేయర్ కుమారస్వామి, సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ లో హై టెన్షన్ ఛలో అంకాపూర్ లో స్వల్ప ఉద్రిక్తత

**-భారీగా పోలీసు బలగాల మోహరింపు**

**జులై 20 వార్త సాక్ష్యం**

ఆర్మూర్ మండలం అంకాపూర్ లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.ఎన్నికల సమయం లో ఆర్మూర్ నియోజక వర్గం నుండి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి ఇచ్చిన మాట తప్పారని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి పిలుపునిచ్చింది.దీంతో ఆర్మూర్ లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా లో రాజకీయ పర్వం వేడెక్కింది.2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయం లో ఆర్మూర్ నియోజక వర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పైడి రాకేష్ రెడ్డి ఎన్నికల ప్రచారం లో భాగంగా పలు హామీలిచ్చారు. రూపాయికే వైద్యం,ప్రతి గ్రామం లో స్వంత నిధులతో పది గృహాల నిర్మాణం లాంటి హామీలిచ్చారు.దిన్ని ఆసరాగా చేసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే గా గెలుపొంది 30 నెలలు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆర్మూర్ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఆర్మూర్ మండలం అంకాపూర్ లో భారీ పోలీస్ బలగాలను మోహరించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నీ హౌస్ అరెస్ట్ చేశారు.బీజేపీ శ్రేణులు అక్కడికి చేరుకోవడం తో కొద్దిపాటి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు పలువురు బీజేపీ నేతలను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్ కు తరలించారు. ఎమ్మెల్యే నివాసం వద్ద



బీజేపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఎవరిని అటు వైపు రాకుండా ఆంక్షలను అమలు చేశారు.ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసం వద్ద భారీ పోలీస్ బలగాలను మోహరించారు.రోజంతా టెన్షన్ వాతావరణం ఏర్పడింది.అధికారం లో ఉన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టి మళ్లించే ందుకు నాటకం ఆడుతున్నారని ఆరోపిం చారు. ఆరు గ్యారంటీలు,420 హామీలు ఏమయ్యా యని ప్రశ్నించారు.మిగులు బడ్జెట్ తో ఏర్పడ్డ తెలంగాణ లో మాములు సామాన్యులను విద్యకు దూరం చేసే విధంగా రేవంత్ రెడ్డి సర్కార్ యత్నిస్తు ందని పేర్కొన్నారు.అందుకు నిదర్శనం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీ రియంబర్స్మెంట్ అందించక పోవడమేన్నారు. గత పది సంవత్సరాలు అధికారం లో ఉన్న కేసీఆర్,నేడు రేవంత్ రెడ్డి లు వారి స్వార్థ ప్రయోజనాల కోసమే యత్నిస్తున్నారు



తప్ప ప్రజల కోసం చేసింది తప్ప అని తెలిపా రు. ప్రజల తరపున తనవంతు. బాధ్యతగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరమా అని పేర్కొన్నారు. 30 నెలల పాలనలో ఆర్మూర్ అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధుల చర్చకు సిద్ధమా అని సవాలు చేశారు.ఇటీవల ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఒక్క రోజు నిరహార దీక్షకు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సైతం పునుకోగా పోలీసులు అడ్డుకున్నారు.దిన్ని కాంగ్రెస్ వర్గీయులు ఉనికి కోసం ఆరాటప డుతున్నారని ఎదురు సమాధానం ఇచ్చారు.వారం రోజుల వ్యవధిలో ఆర్మూర్, బాల్కొండ నియోజక వర్గాలలో ప్రతి పక్షం వర్సెస్ పాలక పక్షం అనే రీతిలో వ్యవహారం కొనసాగిస్తూ అధికార పక్షం నవ్వుల పాలవుతుంది.ఇచ్చిన హామీలను అమలు పరచాలని లేని పక్షం లో ప్రతి పక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరణ**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



**జులై 20 వార్త సాక్ష్యం :**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి,ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా,ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని,పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి,వినతులు,ఫిర్యాదులు స్వీకరించి,అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా,నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

**-గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించిన రామగుండం సీపీ.**



**జులై 20 వార్త సాక్ష్యం :**

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి,వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి,సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి,వారి సమస్యలను ఓర్పుతో విని,ఫిర్యాదులను స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి,చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా ఫిర్యాదు దారులకు పోలీస్ శాఖపై మరింత భరోసా, విశ్వాసం పెరుగుతుందన్నారు.ప్రజలు, బాధితులు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా చట్టపరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు

**- కలెక్టర్ చిత్రా మిశ్రా.**

**జులై 20 వార్త సాక్ష్యం:**

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రమిశ్రా.. ఆయా శాఖల అధికారుల ను ఆదేశించారు. సోమ



వారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 313 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 100 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 30 రోజులకు పైబడి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కోర్టు కేసులు, సీఎం ఆఫీస్, ట్విట్టర్లో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను లాగిన్ లో అప్డేట్ చేయాలని అధికారులకు సూచించారు.

# నల్లగొండలో కానిస్టేబుల్ అరెస్ట్

**-బాలిక వేధింపుల కేసులో పోక్సో నమోదు**
**-ఎస్పీ శరత్ చంద్ర పవార్ సీరియస్ సస్పెన్షన్ వేటు**

జులై 20 వార్త సాక్ష్యం



నల్లగొండ జిల్లాలో బాలికను వేధించిన కేసులో ఓ పోలీసు కానిస్టేబుల్ అరెస్టు కావడం తీవ్ర కలకలం రేపింది. గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా,న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,సైకిల్‌పై వెళ్తున్న ఓ బాలికను అడ్డగించి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థల పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు, మాస్క్ ధరించి సంచరించినప్పటికీ సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించారు. విచారణలో అతడు గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సత్యనారాయణగా తేలింది.ఈ ఘటనను జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్ అత్యంత తీవ్రంగా పరిగణించారు.నిందితుడు పోలీసు శాఖలో పనిచేస్తున్నప్పటికీ ఎలాంటి ఉపేక్షకు తావులేదని స్పష్టం చేస్తూ అతడిని తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ,"ఖాకీ ధరించినంత మాత్రాన చట్టానికి ఎవరూ అతీతులు కారు.మహిళలు,చిన్నారుల భద్రత విషయంలో రాజీ ఉండదు.నేరానికి పాల్పడిన వారెవరైనా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు.పోలీసు శాఖ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చే సిబ్బందిపై కూడా నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.ఇదిలా ఉండగా,ఇదే కానిస్టేబుల్‌పై గతంలో కూడా పోక్సో కేసులు నమోద య్యాయని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ పలుమార్లు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం వెలుగులోకి రావడం మరింత సంచలనంగా మారింది. ఇలాంటి ఆరోపణలు ఉన్నప్పటికీ వరుసగా పోస్టింగులు ఎలా లభించాయనే అంశంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. శాఖాపరమైన పర్యవేక్షణపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవు తున్నాయి.ఈ ఘటనపై ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని,బాధిత బాలికకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. మహిళలు,చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని,చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని జిల్లా పోలీసులు మరోసారి స్పష్టం చేశారు.

## యూనిఫామ్‌లో డీజీపీ ఆఫీస్‌కు డీఎస్పీ సిరాజ్




జులై 20 వార్త సాక్ష్యం

తెలంగాణ పోలీసు శాఖలో డీఎస్పీ హోదాలో ఉన్న టీమిండియా స్టార్ పేసర్,హైదరాబాదీ క్రికెటర్ మహ్మద్ సిరాజ్..రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం పోలీస్ హెడ్ క్వార్టర్‌కు పూర్తి పోలీస్ యూనిఫామ్‌తో విచ్చేసిన డీఎస్పీ సిరాజ్,సీవీ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.సీవీ ఆనంద్ తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిరాజ్ ఆయనను కలవడం ఇదే తొలిసారి కావడం విశేషం.ఖాకీ దుస్తుల్లో డీజీపీ ఆఫీస్‌కు వచ్చిన సిరాజ్‌ను చూసి అక్కడ ఉన్నవారు ఆశ్చర్యానందాలకు లోన య్యారు. ఈ భేటీ అనంతరం మహ్మద్ సిరాజ్ తన సోషల్ మీడియా ఖాతాలో డీజీపీతో దిగిన ఫొటోను పంచుకుంటూ ప్రత్యేక పోస్ట్ పెట్టారు."తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సార్‌ను కలవడం చాలా సంతోషంగా ఉంది .డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఆయన తన నూతన పదవీకాలాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజలకు సేవ చేయడంలో ఆయన నిరంతరం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని సిరాజ్ పేర్కొన్నారు.ప్రస్తుతం డీఎస్పీ హోదాలో యూనిఫామ్‌లో ఉన్న సిరాజ్ ఫొటోలు,ఆయన పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు,నెటిజన్లు 'డీఎస్పీ సిరాజ్ ఆన్ డ్యూటీ' అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# ప్రతీకూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఎంతో ఉత్తమం

**-ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి హితవు**
**-ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ కార్యాచరణపై సుదీర్ఘ సమీక్ష**
**-పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు**





జులై 20 వార్త సాక్ష్యం:

సూపర్ ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత ప్రతీకూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఎంతో శ్రేయస్కరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి హితవు పలికారు. ఈ మేరకు గ్రామగ్రామాన క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష సమావేశం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేశ్ రెడ్డి, తోట లక్ష్మీకాంత్ రావు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి, నగర మేయర్ కే.ఉమారాణి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఎస్పీ రాజేష్ చంద్ర, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యానవన, ఆర్.డబ్ల్యూ.ఎస్, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్, కౌలాస్ నాల, పోచారం, సింగీతం, కల్యాణి, రామడుగు, అలీసాగర్, మంచిప్ప, మాసాని తదితర ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థితి, తాగునీటి సరఫరా తీరుతెన్నులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆరుతడి పంటలకు అందిస్తున్న ప్రోత్సాహం, విద్యుత్ డిమాండ్ – సరఫరా తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా చర్చించారు. తక్కువ నీటితో ఏయే పంటలను సాగు చేయవచ్చు, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేయవచ్చు అనే విషయాలను వ్యవసాయ శాత్రవేత్తలతో పాటు, ఆదర్శ రైతులు తమ అనుభవపూర్వక అంశాలను వివరించారు. ఎల్ నినో నేపథ్యంలో చేపట్టనున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక గురించి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్ లు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. రైతు బాగుంటేనే సమాజంలోని అన్ని వర్గాల వారు బాగుంటారని, అందుకే ప్రస్తుత పరిస్థితులను రైతులు సమర్థవంతంగా ఎదుర్కొనేలా వారికి అధికార యంత్రాంగం యావత్తు తోడ్పాటును అందిస్తూ అండగా నిలిచేలా ప్రభుత్వం అన్ని ఉమ్మడి జిల్లాలలో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై ఉన్నత స్థాయిలో సమీక్షలు ఏర్పాటు చేయించిందని తెలిపారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్ధవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిరక్షిస్తూ, తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులను ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్‌పామ్, కందులు, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగును చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. తీగజాతి, పందిరి కూరగాయల సాగుకు, పాడి పెంపకానికి ప్రభుత్వం నుండి రాయితీ ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ఈ పంటలను కోతులు, అడవి పందులు వంటి వాటి బెడద నుండి కాపాడుకునేందుకు వీలుగా సోలార్ ఫెన్సింగ్ కోసం సబ్సిడీ అందించేలా చొరవ చూపుతామని అన్నారు. కోతులు, అటవీ జంతువులు జనావాసాలలోకి రాకుండా అటవీ ప్రాంతాల్లో విరివిగా పండ్ల మొక్కలు నాటాలని, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఉమ్మడి జిల్లాలోని జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని, భూగర్భ జలాలు రోజురోజుకూ గణనీయంగా తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతుకు భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటి లభ్యత, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, వర్షాభావ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడ కూడా తాగునీటి కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, చుక్క నీరు కూడా వృధా కాకుండా ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని అన్నారు. శాసన మండలి సభ్యులు బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులు కొత్త కాకపోయినప్పటికీ, దాని ప్రభావం బారి నుండి రైతులను, ప్రజలను కాపాడేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇప్పటికే 45 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉన్నందున ప్రతీకూల పరిస్తుతులను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను కార్యోన్ముఖులను చేశారు. ప్రస్తుత తరుణంలో పంటల వైవిధ్యం పాటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని హితవు పలికారు. పరిస్థితులకు అనుగుణంగా పంట విధానాలలో మార్పులు చేయాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్, కూరగాయలు, ఆరుతడి పంటల సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ఇదివరకటి తరహాలో ఉమ్మడి జిల్లాలో చెరకు పంటను ప్రోత్సహించే దిశగా, ఎన్.సీ.ఎస్.ఎఫ్ ఇతర చక్కర పరిశ్రమల పునరుద్ధరణ విషయమై దృష్టిని కేంద్రీకరిస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలను నిలువరించే శక్తి ఎవరికీ ఉండదని, అయితే ముందస్తుగానే అప్రమత్తమై ప్రత్యామ్నాయ కార్యాచరణను చేపడితే చాలా వరకు విపత్తు ద్వారా చేకూరే నష్టం నుండి బయటపడగల్గుతామని అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం అన్ని జిల్లాలలో ప్రత్యా మ్నాయ కార్యాచరణ అమలుకై విస్తృత స్థాయిలో కృషి చేస్తోందని అన్నారు. వర్షాభావం వల్ల నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో పంటల మార్పిడి వైపు దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో ఆదర్శ రైతులు ఉన్నారని, ప్రతీకూల పరిస్థితులను ఎదుర్కోవడంలోనూ వారు సమర్థులేనని అన్నారు. ఇప్పటికే 72 శాతం విస్తీర్ణంలో పంటలు విత్తుకున్నారని, అయితే మిగితా 28 శాతం విస్తీర్ణంలో ఆరుతడి పంటలు వేయాలని హితవు పలికారు. ఈ మేరకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. శాఖల వారీగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించడమే కాకుండా, దానిని పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు సోక్ పిట్స్, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ పెద్ద ఎత్తున నిర్మించేలా చూడాలన్నారు. నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశామని అన్నారు. పంటల మార్పిడి, ఆరుతడి పంటల సాగుపై రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వనరులతో అధిక ఆదాయాన్ని అందించే పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని, అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకునేలా అధికారులను సన్నద్ధం చేశామని అన్నారు. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ప్రతీకూల పరిస్థితుల నేపథ్యంలో ఉద్యానవన పంటల సాగు వైపు దృష్టిని కేంద్రీకరిస్తే ఎంతో ప్రయోజనమని అన్నారు. కూరగాయలు, పప్పుదినుసులు, ఆయిల్ పామ్ వంటి పంటల సాగుకు ముందుకు రావాలని రైతులకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు వల్ల తక్కువ నీటి వసతి, సులభమైన యాజమాన్య పద్ధతులతో దీర్ఘకాలం పాటు అధిక మొత్తం ఆదాయం పొందవచ్చని సూచించారు. అంతర పంటలను సాగు చేసుకునే వెసులుబాటు ఉందని, ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున రాయితీ అందిస్తోందని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, టి.లక్ష్మీకాంత్ రావు, పైడి రాకేశ్ రెడ్డిలు మాట్లాడుతూ, తమ నియోజకవర్గాలలో నెలకొన్న పరిస్థితుల గురించి ప్రస్తావిస్తూ, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. రైతులకు ఫసల్ బీమా వర్తించేలా చూడాలని, సబ్సిడీపై విత్తనాలు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలు కల్పించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భూగర్భ జలాలను పెంపొందించాల్సిన ఆవశ్యకతపై తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్లు వి.భుజంగరావు, వెక్టర్, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేషంట్లకు సేవలందించడంలోనే అపారమైన సంతృప్తి

**-సీ.జీ.హెచ్.ఎస్ ఫార్మాసిస్ట్ లక్ష్మీ కౌసల్య**

జులై 20 వార్త సాక్ష్యం



డాక్టర్ అఫ్ ఫార్మసీ డిగ్రీ ద్వారామెడికల్ ప్రొఫెషనల్ గా పేషంట్లకు ఆరోగ్య సంరక్షణ సలహాలు ఇవ్వడం, ఔషధాలపై పూర్తి అవగాహన, భరోసా ఇవ్వడం, మందుల మోతాదులు, దుష్ప్ర భావాలు, ఉపయోగించే పద్ధతి, నిల్వ విధానాలను ప్రతి రోగి కి వెల్లడించ డంలోనే అసలైన అను భూతి, సంతృప్తి లభిస్తుందని సీ.జీ.హెచ్.ఎస్ ఫార్మాసిస్ట్ జి.లక్ష్మీ కౌసల్య పేర్కొన్నారు. గుంటూరు నగరంపాలెంలోని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి (సీ.జీ.హెచ్.ఎస్) విజయవాడ నుండి బదిలీపై వచ్చిన లక్ష్మీ కౌసల్య సోమవారం నూతన బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ పరిధిలోని ఐదు జిల్లాల ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన నాణ్యమైన ఉత్పత్తులను సిఫార్స్ చేసి, అందించడమే తన లక్ష్యమన్నారు. ఇక్కడి డాక్టర్ల సలహాలు, సూచనలతో రోగులకు విలువైన సేవలు అందిస్తానని వెల్లడించారు. సీ.జీ. హెచ్.ఎస్ లోకల్ ఎడ్వైజరీ కమిటీ మెంబర్లు గుమ్మడి సీతారామ య్యచౌదరి, కట్టా వెంకటేశ్వర్లులు, నూతన ఫార్మాసిస్ట్ లక్ష్మీ కౌసల్యకు పుష్పగుచ్ఛం అందించి మాట్లాడు తూ..అత్యంత నైపుణ్యం, విశ్వసనీయత కలిగిన ఔషధ నిపుణులుగా రాణించాలని కోరారు. మందుల భద్రత,స్టాక్ నిర్వహణతో పాటు రోగులకు మందులను సరిగ్గా అందించాలని సూచించారు. తోలుత లక్ష్మీ కౌసల్య చీఫ్ మెడికల్ ఆఫీసర్లు కొండా నాగార్జున,దాసరి రమేష్ లను మర్యాద పూర్వకంగా కలిసి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమ సుందరి,వైద్య సిబ్బంది సునీల్, పేరేశ్వరరావు, రామారావు తదితరులు లక్ష్మీ కౌసల్యకు శుభాకాంక్షలు తెలిపారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 21 జూలై , 2026

# బిజినెస్

# అంతర్జాతీయ ఉద్రిక్తతల ఎఫెక్ట్..
# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

**నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**

**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో**

**ఇన్వెస్టర్ల అప్రమత్తత**

**443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 96 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**లాభాల్లో ముగిసిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు**



అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితికి తోడు, దేశీయంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి దారితీసింది. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 443 పాయింట్లు నష్టపోయి 77,708.52 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 96 పాయింట్లు క్షీణించి 24,238.50 వద్ద ముగిసింది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,300--24,400 జోన్ తక్షణ నిరోధకంగా కొనసాగుతోంది. ఈ స్థాయిని నిలకడగా అధిగమిస్తేనే బుల్స్ పట్టు సాధించి, సూచీ 24,500--24,600 స్థాయిల వైపు పయనించే అవకాశం ఉంటుంది. ఒకవేళ సూచీ కిందకు వస్తే, 24,100 వద్ద తక్షణ మద్దతు లభిస్తుందని, ఈ స్థాయిని కోల్పోతే లాభాల స్వీకరణ పెరిగి 24,000 సైకలాజికల్ మార్క్ వరకు పడిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. సెషన్ మొత్తంలో బ్యాంకింగ్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి సుజుకి ఇండియా షేర్లు నిఫ్టీలో టాప్ లూజర్లుగా నిలిచాయి. సూచీలు నష్టపోయినప్పటికీ, బ్రాడర్ మార్కెట్ మాత్రం రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.6 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.16 శాతం లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు తీవ్రంగా నష్టపోగా, నిఫ్టీ ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తొమ్మిదో రోజుకు చేరడం, ముఖ్యంగా హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు కేంద్రీకృతమవ్వడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచిందని విశ్లేషకులు పేర్కొన్నారు.

# ఓటమిని జీర్ణించుకోలేకపోయారా?..
# అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటంటున్న ఫుట్‌బాల్ ప్రపంచం!

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి. అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు. ఐమ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు. అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ ఘటనలపై +శ్శుశ్రీ.ఎశీఎ కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ దర్హమ్ తీవ్రంగా స్పందించారు. "వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం" అని ఆయన ఘాటుగా విమర్శించారు.

**ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై స్పెయిన్ విజయం**

**ట్రోఫీ వేడుకలో స్పెయిన్‌ను అవమానించిన అర్జెంటీనా ఆటగాళ్లు**

**ట్రోఫీ వేడుకకు వీపు చూపిన మెస్సీ సేన.. ఇది సిగ్గుచేటన్న విశ్లేషకులు**

**గోల్డెన్ బాల్ అవార్డు సమయంలో మెస్సీ పేరుతో అభిమానుల నినాదాలు**

**మ్యాచ్‌లో, ఆ తర్వాత ఇద్దరు అర్జెంటీనా ఆటగాళ్లకు రెడ్ కార్డులు**

"ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు" అని దర్హమ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు. నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.



# క్రీడలు

**అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే...**

**పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు**



ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్ భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు. "2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు. అయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 2-1 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.

# ‘గేదెలరాజు’ (ఆహా) మూవీ రివ్యూ!



నటుడిగా .. గాయకుడిగా .. సంగీత దర్శకుడిగా రఘు కుంచెకి మంచి పేరు ఉంది. ఈ మధ్య కాలంలో ఆయన నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్రలను ఎక్కువగా చేస్తూ వెళుతున్నాడు. ముఖ్యంగా విలేజ్ నేపథ్యంలోని సినిమాలలో ఆయన ఎక్కువగా కనిపిస్తున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే ‘గేదెల రాజు’ - కాకినాడ తాలూకా అనేది ట్యాగ్. ఏప్రిల్ 24వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 17వ తేదీ నుంచి ‘ఆహా’లో స్ట్రీమింగ్ అవుతోంది. క్రైమ్ డ్రామా జోనర్లో తెరకెక్కిన ఈ సినిమా ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం.‘కాకినాడ’ పరిసర ప్రాంతాలలో ‘భగవాన్ రాజు’ అలియాస్ ‘గేదెల రాజు’ (రఘు కుంచె) తెలియని వారంటూ ఉండరు. ఊళ్లో పనీపాటా లేని కుర్రాళ్లంతా అతని అనుచరులే. డబ్బు .. అమ్మాయిలపై అతనికి వ్యామోహం ఎక్కువ. అందువలన ఆడపిల్లల తల్లిదండ్రులు భయంతో బ్రతుకుతుంటారు. తన రౌడీయిజానికి రాజకీయం కూడా తోడైతే బాగుంటుందని భావించిన గేదెలరాజు’, ముందుగా కార్పొరేటర్ కావాలని కంకణం కట్టుకుంటాడు. ఈ విషయంలో అతనికి ‘దుర్గ’(శ్రీకాంత్ అయ్యంగార్) అడ్డుపడుతుంటాడు. గేదెల రాజు - దుర్గ ఇద్దరూ ఒకప్పుడు మంచి స్నేహితులు. కొన్ని కారణాలు వాళ్లను శత్రువులుగా మారుస్తాయి. ‘దుర్గ’ సంపాదన అంతా కిరాయికి తిరుగుతున్న అతని బోట్లపైనే ఆధారపడి ఉంటుంది. తన వ్యాపారానికి ఎదురులేకుండా ఉండటం కోసం అతను అధికారం కోసం పాకులాడుతుంటాడు. గేదెల రాజుకి వ్యతిరేకంగా తన అనుచరుల సంఖ్యను పెంచుతూ ఉంటాడు. తానే కార్పొరేటర్ కావాలనే పట్టుదలతో ఉంటాడు. అందుకు సంబంధించిన ప్రయత్నాలు గట్టిగానే చేస్తుంటాడు. ఇక ఆ ఊళ్లో ఎక్కువగా వినిపించే పేరు ‘రిచ్’. చెల్లెలు ‘దివ్య’ అంటే అతనికి చాలా ఇష్టం. దివ్య స్నేహితురాలైన ‘మీరా’ (మౌనిక)ను అతను ప్రేమిస్తూ ఉంటాడు. అలాగే ‘మల్లవరం’ గ్రామానికి చెందిన మరో ప్రేమజంటగా విజయ్ - సత్య (టీనా శ్రావ్య) కనిపిస్తారు. ఈ ఇద్దరూ ఒక హాస్పిటల్లో పనిచేస్తుంటారు. భర్తను కోల్పోయిన మీరా తల్లి, గేదెలరాజుతో అక్రమ సంబంధం కొనసాగిస్తూ ఉంటుంది. మరో వైపున సత్యతో పాటు ఆమె ఆస్తిపై కూడా గేదెల రాజు కన్నేస్తాడు. గేదెలరాజు తమ్ముడు ‘శ్యాంబాబు’ అన్నచేసే అరాచకాలకు నాయకత్వం వహిస్తుంటాడు. అయితే అన్నయ్య చేస్తున్న పెత్తనానికి తాను వారసుడిని కావాలనే ఒక బలమైన కోరిక అతనిలో ఉంటుంది. ఇక గతంలో గేదెలరాజుతో కలిసి పనిచేసిన శివయ్య, అతని కారణంగా జైలు జీవితం గడిపొస్తాడు. అప్పటి నుంచి గేదెలరాజుపై ప్రతీకారం తీర్చుకునే సమయం కోసం వెయిట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యలోనే గేదెలరాజు హత్య జరుగుతుంది. అతణ్ణి చంపింది ఎవరు? ఈ కేసు ఇన్వెస్టిగేషన్ లో తేలే నిజాలేమిటి? అనేది కథ. కాకినాడ పరిసర గ్రామాలు .. అక్కడి రాజకీయాలు .. పదవుల కోసం పడే పోటీలు .. అక్రమ వ్యాపారాలు .. ముఠాకక్షలు .. సాధారణ ప్రజలతో పాటు, వాటి బారినపడే ప్రేమికుల చుట్టూ తిరిగే కథ ఇది. మొదటి నుంచి చివరి వరకూ గ్రామాలు .. అక్కడి పరిస్థితులను కలుపుకుంటూ ముందుకు సాగుతుంది. ఒక వైపున గేదెల రాజు హవా కొనసాగడాన్ని చూపిస్తూ, రెండు జంటలకు సంబంధించిన ప్రేమకథలలో కదలిక తీసుకొచ్చారు. సాధారణంగా ఏ కథలోనైనా హీరో - విలన్ ఇద్దరూ ఉంటారు. కానీ ఈ కథలో హీరో - విలన్ ఇద్దరూ ఒక్కరే .. అతనే గేదెలరాజు. కథలో పవర్ఫుల్ గా కనిపించే పాత్ర .. ప్రధానమైన పాత్ర ఏదైతే ఉంటుందో, ఆ పాత్రకి చివరి వరకూ ఏమీ కాదు. ఒకవేళ ఏదైనా జరిగితే అక్కడి నుంచి ఆ కథను ముందుకు నడిపించడం చాలా కష్టమైన విషయం. కానీ ఈ కథలో అందుకు భిన్నంగా జరుగుతుంది. ప్రధానమైన పాత్రగా కనిపించే ‘గేదెలరాజు’ హత్యతోనే ఈ కథ మొదలవుతుంది.గేదెలరాజు చాలా బలవంతుడు, డబ్బు - పలుకుబడి - మందీ మార్బలం ఉన్నవాడు. అలాంటి అతణ్ణి ఎవరు చంపేసి ఉంటారు? అనే దిశగానే ఈ కథ తన ప్రయాణాన్ని మొదలుపెడుతుంది. ఓ ఇరవైఏళ్ల వెనక్కి తీసుకుని వెళ్లి, అక్కడి నుంచి గేదెలరాజు లీలా విశేషాలను మనకి చూపిస్తూ రావడం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే అతని శత్రువులు .. అతనితో ముడిపడిన ప్రేమకథలు తెరపైకి వస్తాయి. గేదెలరాజును ఎవరు చంపేసి ఉంటారు? అనే అంశమే ఆడియన్స్ లో ఉత్కంఠను రేపుతుందని దర్శకుడు భావించి ఉండొచ్చు. అయితే అసలైన గేదెలరాజే చనిపోయిన తరువాత మిగతా కథను తెలుసుకోవడానికి ప్రేక్షకులలో ఎక్కువమంది అంత సిద్ధంగా ఉండకపోవచ్చు. సినిమాల వరకూ చూసుకుంటే, చనిపోయిన ఒక వ్యక్తి తాలూకు హీరోయిజాన్ని .. విలనిజాన్ని ఎంత గొప్పగా చూపించినా ఆశించినస్థాయి ప్రయోజనం ఉండకపోవచ్చునేమో. విలేజ్ నేపథ్యంలో ‘గేదెల రాజు’ పాత్రను డిజైన్ చేసుకున్న తీరు చాలా బాగుంది. అయితే ఆయన ప్రధాన శత్రువులైన దుర్గ .. శివయ్య పాత్రలను అంత సమర్థవంతంగా మలచలేకపోయారు. ఇక రెండు ప్రేమ జంటలకు సంబంధించిన ట్రాక్ కూడా అంత బలంగా అనిపించదు. ఇందుకు సంబంధించిన సన్నివేశాల ఆవిష్కరణపై ఇంకాస్త కసరత్తు చేయవలసిందేమో అనిపిస్తుంది. నేరం ఎవరు చేశారు? అనే కోణంపై ఆడియన్స్ లో ఆసక్తి పెరగాలంటే, ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు ఒక రేంజ్ లో ఉండాలి. కానీ ఈ ట్రాక్ కూడా బలహీనంగానే కనిపిస్తుంది. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ పాత్ర చాలా వీక్ గా అనిపిస్తుంది. చాలా ముఖ్యమైన ఈ పాత్ర విషయంలో కేర్ తీసుకోవాల్సింది. కొన్ని పాత్రలకి జరిగిన ఆర్టిస్టుల ఎంపిక చూస్తే రాంగ్ ఛాయిస్ అని కూడా అనిపిస్తుంది. ‘రిచ్’ వంటి పేర్లు పిలవడం .. పలకడం కూడా కష్టమేనని గ్రహించాలి. కుంచె రఘు యాక్టింగ్ బాగుంది. ‘గేదెలరాజు’ పాత్రలో ఆయన మెప్పించాడు. ఆయన స్వరపరిచిన ఒక మెలోడీ బాగుంది. నేపథ్య సంగీతం అక్కడక్కడా కాస్త ఇబ్బంది పెడుతుంది. ఇక మిగతా పాత్రలేవీ అంతగా ప్రభావితం చేయలేదు. ఆ స్థాయిలో డిజైన్ చేసే ప్రయత్నాలు జరగలేదు. ఫొటోగ్రఫీ .. ఎడిటింగ్ ఫరవాలేదు. కథలో అనవసరమైన సన్నివేశాలు .. అవసరానికి మించిన పాత్రలు కూడా కనిపిస్తాయి.

## నాకు, అఖిల్, చైతన్యకి పండగలా ఉంది.. ఇల్లంతా కళకళలాడుతూ ఉంది: నాగార్జున



**లెనిన్’ బ్లాక్‌బస్టర్ విజయంపై ‘వైభవం’ పేరుతో సక్సెస్ మీట్**
**ఇంట్లో పండగ వాతావరణం నెలకొందని చెప్పిన నాగార్జున**
**అన్నగా, అభిమానిగా అఖిల్‌ను చూసి గర్వపడుతున్నానన్న నాగ చైతన్య**
**కేవలం 3 రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించిందని తెలిపిన చిత్రబృందం**
**డిస్ట్రిబ్యూటర్లకు, యూనిట్ సభ్యులకు షీల్డులు అందజేత**

అక్కినేని అఖిల్ ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భారీ విజయం ‘లెనిన్’ రూపంలో వరించింది. ఈ ఆనందాన్ని పంచుకునేందుకు సోమవారం నాడు ‘బ్లాక్ బస్టర్ వైభవం’ పేరుతో చిత్ర బృందం విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలో అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ ఒకే వేదికపై కనిపించి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఈ విజయం తమ కుటుంబంలో పండగ వాతావరణాన్ని తీసుకొచ్చిందని నాగార్జున భావోద్వేగంతో చెప్పగా, తమ్ముడి విజయాన్ని చూసి ఓ అన్నయ్యగా, అభిమానిగా గర్వపడుతున్నానని నాగ చైతన్య అన్నారు. ఈ వేడుకలో డిస్ట్రిబ్యూటర్లకు, చిత్ర బృందానికి షీల్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. “చాలా కాలం తర్వాత డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లను పిలిచి ఇలా షీల్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రతిచోటా హౌస్ ఫుల్స్ పడుతున్నాయని ఫోన్లు వస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. మీకు (అభిమానులకు) ఎలా ఉందో తెలీదు కానీ, నాకు, అఖిల్, చైతన్యకు మాత్రం ఇంట్లో పండగలా ఉంది. ఇల్లంతా కళకళలాడుతోంది. ఈ ప్రేమ కోసం, ఈ అరుపుల కోసమే అఖిల్ ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాడు. ఆ ప్రేమను ప్రేక్షకులు, అభిమానులు తిరిగి చూపించారు. రైటర్ సత్యానంద్ గారు ఇచ్చిన ఇన్‌పుట్స్, అన్నపూర్ణ పోస్ట్ ప్రొడక్షన్ టీమ్ కష్టం ఈ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. రెండు వారాల ముందే సినిమాను పోస్ట్ ప్రొడక్షన్‌కు ఇస్తే అద్భుతమైన అవుట్‌పుట్ వస్తుంది. అందరూ ఈ విషయాన్ని గమనించాలి” అని అన్నారు. నాగ చైతన్య మాట్లాడుతూ.. “తమ్ముడు కాస్త లేట్‌గా వచ్చినా, అభిమానులు మాత్రం లేటెస్ట్‌గా సపోర్ట్ చేశారు. కథ విన్నప్పుడే అఖిల్ సక్సెస్ కొట్టాడని ఫిక్స్ అయ్యాను. ‘లెనిన్’ పాత్రకు, అఖిల్‌కు ఎలాంటి సంబంధం ఉండదు. కానీ ఆ పాత్ర కోసం తను పూర్తిగా మారిపోయాడు. ఓ అన్నయ్యగా, అభిమానిగా అఖిల్‌ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. నాన్నగారి ఫైర్ ఎలాంటిదో నాకు, అఖిల్‌కు బాగా తెలుసు. ‘శివ’, ‘అన్నమయ్య’, ‘నిన్నే పెళ్లాడతా’ వంటి చిత్రాలను ఆయన ఎంత డేరింగ్‌గా తీశారో, ‘లెనిన్’ విషయంలోనూ అదే డేరింగ్ చూపించారు. ఒక హీరోని ఎలా ప్రాజెక్ట్ చేయాలో నిర్మాత నాగవంశీకి బాగా తెలుసు. తమన్ తన సంగీతంతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడు. నా బేబీ సిసింద్రీకి ఇంత పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు” అని తన ఆనందాన్ని పంచుకున్నారు. హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ.. “ఈ సినిమా గురించి ఇప్పటికే చాలా మాట్లాడాం. విడుదలైన రెండో రోజు నుంచే థియేటర్లు పెంచి మాకు మద్దతుగా నిలిచిన డిస్ట్రిబ్యూటర్లకు థాంక్స్. కేవలం మూడు రోజుల్లోనే మా సినిమా బ్రేక్ ఈవెన్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ, మా కోసం వచ్చిన అక్కినేని అభిమానులకు, అన్నయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు” అని తెలిపారు. అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ‘లెనిన్’ చిత్రానికి మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు. జూలై 10న విడుదలై ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసుకుని, విజయవంతంగా ప్రదర్శించబడుతోంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.